దివ్యాంగులకు వంద శాతం సబ్సిడీపై రుణాలు

బిచ్కుంద, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు జీవనోపాధి కోసం 100 శాతం సబ్సిడీపై రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బిచ్కుంద మండల వికలాంగుల అధ్యక్షుడు బాలకిషన్ తెలిపారు. బ్యాంకుల ప్రమేయం లేకుండా అర్హులైన దివ్యాంగులకు సంక్షేమశాఖ ద్వారా రూ.50 వేలు వంద శాతం సబ్సిడీపై అందివ్వనున్నట్లు ఐసీడీఎస్ పీడీ ప్రమీల తెలిపారన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు ఉపయోగించుకుని ఆర్థికపరంగా అభివృద్ధి చెందాలని రుణాల కోసం మండలంలోని దివ్యాంగులందరూ ఫిబ్రవరి 2లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



- మంజీరాను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- ఇసుక రీచ్‌లు రద్దయినా గుట్టుగా తవ్వకాలు
- చెక్‌డ్యాంల పేరిట అక్రమంగా ఇసుక తవ్వకాలు
- శివారు ప్రాంతాల్లో భారీగా డంపులు
- బీర్కూర్, బిచ్కుంద మంజీరాలో భారీగా ఇసుక తవ్వకాలు
- పాతంగల్ మంజీరా నుంచి భారీ టిప్పర్‌ల ద్వారా బిచ్కుంద మీదుగా ఇసుక తరలింపు
- కొందరు పోలీసు, రెవెన్యూ శాఖలోని సిబ్బంది సహకారంతో అక్రమ రవాణా

కామారెడ్డి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. జిల్లా యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఇసుకాసురులు కొత్తదారులు వెతుకుతూ ఏదో ఒక రకంగా ఇసుకను అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. ప్రధానంగా మంజీరా నదిలోంచి ఇసుకను తవ్వేస్తు అక్రమంగా కోట్లాది రూపాయల ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. బీర్కూర్, బిచ్కుంద మంజీరాలో ఇసుక రీచ్‌లు మూసి వేసినప్పటికీ ఇసుక అక్రమ రవాణా మాత్రం సాగుతునే ఉంది. అభివృద్ధి పనులు, చెక్‌డ్యాంల నిర్మాణం పేరిట కొందరు ఇసుకాసురులు ట్రాక్టర్‌లు, భారీ లారీలు, టిప్పర్‌లతో గుట్టుగా వేరే ప్రాంతాలకు తరలిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. క్షేత్రస్థాయిలోని కొందరు పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బందితో, స్థానికంగా ఉండే చోటామోటా నాయకుల అండదండలతోనే ఇసుకను కొల్లగొడుతున్నారంటు స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే మంజీరా పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలు పట్టుబడుతుండడం, ఇసుక డంప్‌లను సీజ్ చేస్తుండడం బట్టిచూస్తే అక్రమంగా ఇసుక ఏ స్థాయిలో తరలుతుందో అర్థమవుతోంది.

మంజీరాలో చెక్‌డ్యాంల పేరిట ఇసుక తవ్వకాలు

జిల్లాలో నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్ మండలాల మీదుగా మంజీరా ఉన్నది. ఈ మంజీరా నదిలో చాలానే ఇసుక క్వారీలు ఉండేవి. గతంలో ఈ క్వారీల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలతో ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కేవలం ప్రభుత్వ పథకాల నిర్మాణాలకు మాత్రమే ఇసుక తవ్వకాలు అనుమతించారు. మంజీరా నదిలో ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా తరలిస్తు న్నట్లు గుర్తించిన అధికారులు ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. ఇలా కొన్ని రోజుల పాటు మంజీరాలో ఎలాంటి ఇసుక తవ్వకాలు జరుగలేదు. మంజీరా నదిలో చెక్‌డ్యాంల నిర్మాణాలకు గతంలోనే పనులు ప్రారంభించారు. వర్షాకాలంలో మంజీరాలో వరద పోటెత్తడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడం చెక్‌డ్యాంల పనులు మొదలు పెట్టేందుకు ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. చెక్‌డ్యాంల పేరిట, అభివృద్ధి పనులకు ఇసుకను తరలిస్తున్నామం టూ అక్రమంగా వేరే ప్రాంతాలకు రవాణా చేస్తు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా బిచ్కుంద మండల పరిధిలోని హస్గుల్, షెట్లూర్, ఖద్గవ్ మంజీరాలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ శివారు ప్రాంతాల్లో గుట్టుగా డంపులు చేస్తున్నారు. పగలు భారీ టిప్పర్‌లలో ఆ ఇసుకను నింపి యథేచ్ఛగా తరలిస్తున్నారు.



నస్రుల్లాబాద్‌లో సీజ్ చేసిన ఇసుక డంప్‌లు



పెద్దకొడప్‌గల్‌లో ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

పాతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా

జిల్లా సరిహద్దు అయిన పొరుగు జిల్లాకు చెందిన కోటగిరి మండలం పొతంగల్ మంజీరా నదిలో స్థానికంగా ఉండే కొందరు చోటామోటా నాయకులు అక్రమంగా ఇసుకను తవ్వుతూ స్థానికంగా భారీగా డంపులు ఏర్పాటు చేస్తున్నారు. పగలు కాగానే భారీ టిప్పర్‌లు, లారీల ద్వారా మంజీరా నది గుండా బీర్కూర్, బిచ్కుంద మీదుగా తరలిస్తున్నారు. బిచ్కుంద మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి ఉండడంతో గుట్టు గా పొతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా ఇసుక లారీలను జాతీయ రహదారి పైకి ఎక్కించి హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటకలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ మీదుగా భారీ ఇసుక టిప్పర్‌లను తరలిస్తుండగా పెద్దకొడప్‌గల్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. నాలుగు రోజుల కిందట నస్రుల్లాబాద్‌లో భారీ ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశారు.

కొందరు పోలీసు, రెవెన్యూ అధికారుల అండ

బిచ్కుంద, బీర్కూర్ మంజీరా పరివాహక ప్రాంతంలో రాత్రి వేళలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ దందా అంతా స్థానికంగా ఉండే పోలీసు, రెవెన్యూ, చోటామోటా నాయకుల అండతోనే సాగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇసుక రీచ్‌లు కొనసాగుతున్న సమయంలో ముడుపులకు అలవాటు పడిన స్థానికంగా ఉండే రెవెన్యూ, పోలీసు సిబ్బంది కొందరు అధికారులు ఇసుక అక్రమ రవాణాకు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అధికారికంగా ఇసుక రీచ్‌లు నడవకపోవడంతో ముడుపులకు అలవాటు పడిన కొందరు అధికారులు, సిబ్బంది ఇసుక అక్రమ రవాణాకు అండగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంజీరాలో ప్రతిరోజూ అక్రమంగా ట్రాక్టర్‌ల ద్వారా ఇసుక తవ్వకాలు జరిపి రవాణా జరుపుతున్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ముడుపులు ఇచ్చిన ఇసుక ట్రాక్టర్‌లను వదిలేస్తున్నారని డబ్బులు ఇవ్వని వాటిని రెవెన్యూ, పోలీసు సిబ్బంది పట్టుకుని సీజ్ చేస్తున్నట్లు స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అడపాదడపగా రెండు, మూడు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకుంటున్నామని గొప్పగా చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం మంజీరాలో ఇసుక తవ్వకాలను పోలీసు, రెవెన్యూ అడ్డుకోవడం లేదని స్థానిక గ్రామస్థుల నుంచి ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణల వైపు ముందుకు సాగాలి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి
- భిక్కనూరు చైతన్య పాఠశాలలో సైన్స్ ఫెయిర్
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



7

మహిమాన్విత క్షేత్రం.. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

- రేపటి నుంచి నిజామాబాద్ జిల్లా మెండోరాలో ఆలయ వార్షికోత్సవాలు
- 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఉత్సవ విగ్రహాలు
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులు



7

జిల్లాలో బీఆర్‌ఎస్ నిరసనలు

- కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి మోసం చేసింది
- గాంధీ విగ్రహానికి వినతి పత్రాలు అందజేసిన బీఆర్‌ఎస్ నాయకులు



8

కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు పదవులు ఇస్తాం

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

సదాశివనగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు పదవులు అంజేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. గురువారం మర్కల్ అశోక్ గార్డెన్స్‌లో చెరుకు అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఇర్షాద్ ఉద్దీన్, డైరెక్టర్‌లుగా పీర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఫ్యాక్టరీ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఉంటుంది. కానీ ఎప్పుడు కూడా నియోజకవర్గానికి చెందిన నాయకుడు చైర్మన్ కాలేదని అన్నారు. దీని కోసం 9 నెలలుగా సీఎం, మంత్రితో వ్యక్తిగతంగా మాట్లాడి ఎంతో మందితో కొట్లాడితే ఈ పదవి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వాలు నియోజకవర్గాన్ని 10 ఏళ్లు వెనక్కి నెట్టేశాయని ఇప్పుడిప్పుడే దారిన పడుతున్నాయని అన్నారు. చెరుకు రైతులకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని విధాలుగా రైతులకు సహకరించాలని చైర్మన్, గాయత్రి షుగర్స్ యాజమాన్యానికి తెలిపారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం ప్రతి ఒక్కరూ బాగా కష్టపడి అన్ని స్థానాలను గెలుచుకోవాలని తెలిపారు. ప్రతీ ఒక్కరికి అండగా ఉంటానని ఎల్లారెడ్డి అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ ఇరాదుద్దీన్ మాట్లాడుతూ ఏ రాజకీయ చరిత్రలేని తనకు మహోన్నతమైన పదవి అందించిన మదన్‌మోహన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. చెరుకు రైతుల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తు ఎమ్మెల్యేకు ఎల్లవేళలా అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రూపేందర్‌రెడ్డి, లింగాగౌడ్, బాగయ్య, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం

జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థికి హెల్మెట్ అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అతివేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి వారితో పాటు ఎదుట వచ్చేవారి ప్రాణాలను సైతం బలి తీసుకుంటారని తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉన్న భౌతిక నియమాల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలను విద్యార్థులను అడుగుగా సరైన సమాధానం చెప్పిన సాయి, సన్ని అనే విద్యార్థులకు హెల్మెట్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గీత, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాల సర్దుబాటు

- 10 మండలాల పరిధిలో ఎంపీటీసీ స్థానాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్
- నేడు అభ్యంతరాల స్వీకరణ,
- ఫిబ్రవరి 1, 2న అభ్యంతరాల విచారణ
- 3న తుది ప్రచురణ

కామారెడ్డి టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో నూతనంగా ఏర్పడిన 10 మండలాల పరిధిలో ఎంపీటీసీ స్థానాలకు గురువారం జడ్పీ సీఈవో చందర్‌నాయక్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, డోంగ్లీ, మహ్మద్‌నగర్‌లు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలో కనీసం 5 ఎంపీటీసీ స్థానాలు ఉండే విధంగా నిబంధనలు ఉండడంతో అందుకు అనుగుణంగా సర్దుబాటు చేసి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శుక్రవారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో లేదంటే జడ్పీ కార్యాలయాల్లో అతికించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నారు. ఆయా మండలాల పరిధిలో ఎవరికైన అభ్యంతరాలు ఉంటే ఎంపీడీవో, జడ్పీ కార్యాలయాల్లో సంప్రదించి అభ్యంతరాలు తెలుపవచ్చని ఫిబ్రవరి 1, 2 తేదీల్లో అభ్యంతరాలపై విచారణ చేసి 3వ తేదీన తుది ప్రచురణ చేయనున్నట్లు జడ్పీ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- అస్వస్థతకు గురైన విద్యార్థుల పరిస్థితిపై ఆరా
- మధ్యాహ్నం భోజనం ఏజెన్సీ నిర్వాహకుల తొలగింపు
- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థతకు గురైన విద్యార్థుల పరిస్థితిని పాఠశాల హెచ్‌ఎం మాణిక్యంను అడిగి తెలుసుకున్నారు. అలాగే అస్వస్థతకు గురైన వారితో కలిసి భోజనం చేసిన తోటి విద్యార్థులతో అదనపు కలెక్టర్ మాట్లాడి, భోజనం నాణ్యత, వికటించి అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలు ఆరా తీశారు. అంతకు ముందే పాఠశాలకు చేరుకున్న ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి బలరాం, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని డాక్టర్ శిరీషను, భోజనం వికటించడానికి గల కారణం తెలుసుకున్నారు. ఈ లోగా స్థానిక ఆర్డీవో మన్నె ప్రభాకర్ అక్కడికి చేరుకుని అదనపు కలెక్టర్‌కు విద్యార్థుల పరిస్థితి గురించి వివరించారు. ప్రమాదం లేదని, అందరూ కోలుకున్నారని తెలిపారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ మధ్యాహ్న భోజన వంటశాల, స్టాక్ రూంను ఆర్డీవో, ఎంఈవో, హెచ్‌ఎంతో కలిసి పరిశీలించారు. విద్యార్థులు అస్వస్థతకు గురికావడం వల్ల పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్థానిక ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేశామని స్థానిక ఎంఈవో ఏవీ. వెంకటేశం వివరించారు. వెంటనే వంట ఏజన్సీ నిర్వాహకులను తొలగించి, నూతన ఏజన్సీ నిర్వాహకులను ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలోనే మెనూ ప్రకారం అందించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఎంఈవోను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యతతో పాటు పరిశుభ్రంగా తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంను ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఇన్‌చార్జి డీఈవో బలరాం, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారిని డాక్టర్ శిరీష, ఎంఈవో ఏవీ వెంకటేశం, పాఠశాల హెచ్‌ఎం మాణిక్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం భోజనం వికటించి 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ లేక నిర్లక్ష్యంగా వ్యవహరించారని కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీఈవో బలరాం సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



నగరంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే



ఆర్మూర్‌లో..



మెండోరలో..

సుభాష్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిందని 420 బూటకపు హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని నిజామాబాద్ అర్బన్ మాజీ శాసనసభ్యులు బిగాల గణేష్‌గుప్త విమర్శించారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లోగల గాంధీ విగ్రహానికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అమలుకాని హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. డిక్లరేషన్ల పేరుతో, హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలను ఇచ్చిందన్నారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి 420 రోజులైనా హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను ముప్పతిప్పలు పెడుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ నేతలంతా అబద్దాలు చెప్పి మోసం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదంటూ అబద్దాలు చెబుతున్నారని అన్నారు. 2021లోనే కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొన్నారని అన్నారు. కేసీఆర్ మానవతాదృక్పధంతో ఆలోచించి ప్రతీ నిరుపేదకు రేషన్ కార్డు కావాలనే ఆలోచనతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆదాయపరిమితిని సరళించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ దండు నీతూకిరణ్, మాజీ నుడా చైర్మన్ చామకూర ప్రభాకర్‌రెడ్డి, నగర అధ్యక్షులు సిర్పరాజు, సత్యప్రకాష్, దండు శేఖర్, నవీద్ ఎక్బాల్, మాజీ కార్పొరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్: ప్రజా పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గాండ్ల మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులు గడుస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు నచ్చడం లేదని, ప్రజా పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.పోచయ్య, నీరడి సాయిలు, కొండల్ వాడి సాయికిరణ్, చాంద్ పాషా, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహన్మాన్ ఆవరణలో మహాత్మగాంధీ విగ్రహానికి గురువారం బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో 420 ఇచ్చిన హామీలను 420రోజులైన నెరవేర్చడం లేదని అన్నారు. రైతులకు రుణమాఫీ వంద శాతంపూర్తి చేయాలని, మహిళలకు రూ.4వేల పింఛన్ వెంటనే అమలు చేయాలని, అర్హులకు ఇందిరమ్మఇళ్లు మంజూరు చేయాలని, కల్యాణలక్ష్మీ పథకంలో తులం బం గారాన్ని అర్హులకు వెంటనే ఇవ్వాలని గాంధీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

● 420 హామీలు ఏమయ్యాయి : అర్బన్ మాజీ ఎమ్మెల్యే

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, మాజీజడ్పీటీసీ సంతోష్, మాజీకౌన్సిలర్ లింబాద్రిగౌడ్, పోలసు ధాకర్, నచ్చు చిన్నారెడ్డి, ఇ.గంగాధర్, జన్నెపల్లి రంజిత్, మీరశ్రావణ్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: కేసీఆర్ హయాంలోనే తెలంగాణాలో విప్లవాత్మక పథ కాలకు శ్రీకారం చుట్టారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పదేళ్ళ పాలనలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ లు నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ారస మండలాధ్యక్షుడు పూర్ణానందం, మాజీ ఎంపిటీసీ మధుసుధన్, బద్దం ప్రభాకర్, సింగ సారం గంగారం, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, లక్కం నర్సయ్య, సాగర్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఈ దుష్ట, దౌర్జన్య, అబద్దాల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 420హామీలు ఇచ్చి ఈ రోజుకు 420రోజులు పూర్తయిన సందర్భంగా ఏటువంటి హామీలు పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసేలా మహాత్మాగాంధీకి వినతిపత్రం సమర్పించారు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు మేరకు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి 420రోజులు గడుస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటిలను అమలు చేస్తామని చెప్పి ఇప్పటికి అమలు చేయడంలేదని ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జెసి.గంగారెడ్డి, ద్యావతి అశోక్, ఏలాల భూమా రెడ్డి, వాంకర్ శ్రీనివాస్, చిన్నారెడ్డి, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: గత తెలంగాణ పాలనలోనే లబ్ధిదారులకు సమయానుకూలంగా సంక్షేమపథకాలు అందాయని ఇప్పటికి ప్రజలు మరిపోకుండా ఉన్నారని కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టి అందించిన ఘన చరిత్ర కేసీఆర్‌కే దక్కిదని అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో మహాత్మగాంధీ కాంగ్రెస్‌ప్రభుత్వం మనసుమార్చి హామీలను అమలు చేయువిధంగా చూడాలని కోరుతూ.. వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపిటీసి సుధాకర్, బద్రీ నరేందర్, మహేందర్, రఘు, సుభాష్ గౌడ్,అశోక్, హనీఫ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై మహాత్మగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. జనవరి 30న గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో 420హామీలు పేరుతో అధికారంలోకి వచ్చి 420రోజులు గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి, గద్దల సాయిలు, మాజీకోఆప్షన్ సభ్యుడు మునీరోద్దిన్, జక్కుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో..



ఏర్గట్లలో మాట్లాడుతున్న నాయకులు

మెండోర: ఓమహాత్మా మీరు మళ్లీ పుట్టాలి ఎందుకంటే ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నా 420హామీలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల మీ దీక్ష పట్టుదల సంక్షేమ పథకాల అమలు జరిగేలా చేయాలని డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఇచ్చిన 420హామీల వినతిపత్రాన్ని మహాత్మగాంధీ విగ్రహానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏఒక్క హామీ కూడా సరిగ్గా నెరవేర్చలేదని ముఖ్యంగా అన్ని రంగాలను నిరేత్వార్యం చేశారని పరిపాలనపై ఏలాంటి అవగామన లేకుండా ఇష్టానుసారంగా పారిపాలిస్తున్నారని వారిచ్చిన 420 హామీలు ఇచ్చి మారిచిపోయారని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ఈకార్యక్రమంలో తలారిగంగాధర్, నవీన్‌గౌడ్,మచ్చర్ల రాజారెడ్డి, ఏలేటి శ్రీనివాస్, గోపిడి గంగారెడ్డి, ఇట్టెడి గంగారెడ్డి, సదానంద్ పాల్గొన్నారు.

భీమ్‌గల్: ఏడాదికాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని వెంటనే వారి కళ్లు తెరిపించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.బీఆర్ఎస్ పార్టీ హయాంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కేసీఆర్ ముందుకు వెళ్లాడని కానీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, వెంటనే వారిని అమలు చేసి ప్రజలకు సుపరిపాలన అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీజడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ భగత్, మాజీసొసైటీచైర్మన్‌రాజేశ్వర్, నాయకులు మోయిజ్, శర్మనాయక్, తుక్కాజీనాయక్, మాణిక్యాల శ్రీనివాస్, మాజీసర్పంచ్‌లు కొగూరు సుమన్, సిద పల్లి రాములు, మాజీఎంపీటీసీలు సూళ్ళ నర్సయ్య, చిన్నోల్ల రాజేశ్వర్, సురి ల్, పతాని లింబాద్రి, రాజునాయక్, మాజీకౌన్సిలర్‌లు రాజక్, బోదిరెస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్



ఆర్మూర్ ఎక్సైజ్ అధికారులు స్వాధీనం గంజాయి, బైక్

ఆర్మూర్‌రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని గురువారం రిమాండ్‌కు తరలించినట్టు ఆర్మూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్టీవెన్‌సన్ తెలిపారు. పోచంపాడ్ ఎక్స్‌రోడ్ వద్ద ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న నెరడిగొండకు చెందిన సబ్లె ప్రకాష్, బరదవల్ గవస్కర్‌లను అపి తనిఖీ చేయగా ద్విచక్ర వాహనంపై ఉన్న సంచిలో ఎండు గంజాయి లభించినట్టు తెలిపారు. వారిని విచారించగా ఎండు గంజాయిని ఆదిలాబాద్ జిల్లా నేరేడిగొండలో కొనుగోలు చేసి పోచంపాడ్‌లో విక్రయించానికి తీసుకువస్తున్నామని తెలిపారన్నారు. వారి వద్ద నుంచి 1300గ్రాముల ఎండు గంజాయి. బజాజ్ పల్సర్‌బైక్, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చామన్నారు. ఆదిలాబాద్ నుంచి ఎండు గంజాయిని అక్రమరవాణా చేస్తున్న వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.అక్రమంగా రవాణా చేసిన వారి వద్ద గంజాయి లభించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై చంద్రమౌళి, సిబ్బంది సాగర్, ధర్మందర్, సాయిలు, వికాస్‌గౌడ్, సందీప్, నరేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

మోర్తాడ్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయరహదారిపై దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. గద్దర్ ప్రజలను చైతన్యపరిచి పాట ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మల్లూరి రాజారాం, ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఉమేష్ మహరాజ్, అంగురి మాలాజి, జంబవ చామర్, మామిడి గంగాధర్, శేఖర్, సాగర్, గణేష్, రాజేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ప్రజాగాయకుడు గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యాలను ఉపసంహరించుకోవాలని నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొస్సరి వినోద్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మున్నూరు ప్రణయ్, సుదీర్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లందరికీ అపార్ ఐడీ నెంబర్ జత చేయాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీ 12అంకెల నెంబర్‌ను ఆన్‌లైన్‌లో జత చేయాలని మండల విద్యాధికారి రాజగంగారాం అన్నారు. ఆర్మూర్‌లో గురువారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెంబర్ విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు కొనసాగుతుందని తల్లిదండ్రుల సమ్మతి పత్రం తీసుకొని నెంబర్ జనరేట్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, విశ్వనాథం, పతాని సురేందర్, అలేఖ్య, శ్యామల బాయి, లక్ష్మణ్, విజయ్‌కుమార్, మల్లయ్య, బాల్‌రాజ్, సీఆర్‌పీలు శ్రీనివాస్, లత, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,జనవరి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సండేపల్లి సాయిలు(65)అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ బాబు రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సండేపల్లి సాయిలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, గురువారం మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులో గల అలీసాగర్ లిఫ్ట్ కెనాల్‌లో పడి ఆత్మహత్య చేసుకున్నారని ఆయన అన్నారు. అటు వైపుగా వెళ్లి స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని మృదేహాన్ని జాల్లర్ల సాయంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఏఎస్‌ఐ తెలిపారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గోవింద్‌పేట్‌లో మహిళ అనుమానాస్పద మృతి

ఆర్మూర్‌టౌన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో స్వప్న అలియాస్ పోశవ్వ(50) అనే మహిళ అనుమానస్పదంగా మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాన్సువాడ మండలం మిర్జాపూర్ గ్రామానికి చెందిన మృతురాలు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు గ్రామానికి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత కొద్ది రోజులుగా ఇంటికి తాళం వేసి ఉండడంతో స్థానికులు అటు వైపు వెళ్ళలేదు. గురువారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కిటికిలో నుంచి చూడగా మహిళ మృతి చెంది ఉన్నట్టు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ చేరుకొని క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించి జాగిలంతో దర్యాప్తును కొనసాగించారు.

ఉపాధి హామీ ఉద్యోగులకు వేతనాలివ్వండి

నిజామాబాద్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు గురువారం వినతిపత్రాన్ని అందించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని కోరారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడం వల్ల ఇంటి కిరాయిలతో పాటు ఇతర బిల్లులను చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని తెలిపారు

కారును ఢీకొన్న కంటైనర్

ముప్కాల్, జనవరి30(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఆగి వున్న కారును కంటైనర్ ఢీకొట్టింది. సంఘటనకు సం బంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూర్‌కు చెందిన కె.నాగన్న తన కియాకారులో కుర్మన్నతో కలిసి నిర్మల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో బాల్కొండ వద్ద కారు నిలిపారు. ఆర్మూర్‌వైపు నుంచినిర్మల్ వైపువెళ్తున్న కంటైనర్‌వేగంగా కారును ఢీకొట్టింది.హైవే సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

డొంకేశ్వర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో మన దేశాన్ని కుష్టు వ్యాధి రహితంగా మార్చాలని డొంకేశ్వర్ వైద్యాధికారి విద్యాసాగర్ అన్నారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి మహాత్మజ్యోతిరావుపూలే పాఠశాలలో కుష్టు వ్యాధి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కుష్టువ్యాధిపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేందర్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట

రెంజల్,జనవరి30(ఆంధ్రజ్యోతి): రైతులకు నిరంతర విద్యుత్ పంపిణీలో జాప్యం రాకుండా తగిన చర్యలు చేపడతామని డీఈ రమేష్ అన్నారు. గురువారం మండలంలోని దూపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వెంట ఏడీఈ ప్రభాకర్, ఏఈలు భూమేష్, అజర్, లైన్‌మెన్ శ్రీనివాస్, అసిస్టెంట్ లైన్‌మెన్లు మక్దుమ్, విద్యాసాగర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో కుస్తీ పోటీలు

మోస్రా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అల్లమా ప్రభు జాతర సందర్భంగా చందూర్ మండల కేంద్రంలోని అల్లమా ప్రభు శివాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందూర్ మండల కేంద్రంతో పాటు మోస్రా, వర్ని మండలాల గ్రామస్థులు పాల్గొన్నారు.

చిరుత పులి ఆనవాళ్ల కోసం పరిశీలన

ఎడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్, జానకంపేట గ్రామ శివారులలో చిరుతపులి కలవరపెడుతుంది. మంగళవారం సాయంత్రం ఓ బ్యాంకు ఉద్యోగి తన ద్విచక్రవాహనంపై వెలుతుండగా వెంబడించిందని, బుధవారం సాయంత్రం జానకంపేట గ్రామ శివారులో గల కమిషనరేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో ఓ కుక్క పిల్లను చిరుత పులి ఎత్తుకెళ్లిందని అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు సాయిలు దానిని చూసి భయభ్రాంతుకు లోనై వెంటనే అతను గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుని ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశాడు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఎస్సై శివరాం అటవీ అధికారులకు సమాచారం అందించారు.

ఫటా..ఫట్...

తెల్లకార్డులున్న వారందరికీ ఉచిత విద్యుత్

● తిరుమల, ఎంపీడీవో మోర్తాడ్



ఆంధ్రజ్యోతి:మండలంలోని పది గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల వల్ల ఎంత మంది లబ్ధిపొందారు?

ఎంపీడీవో:మండలంలోని పదిగ్రామాల్లో ఆత్మీయభరోసా కింద1756,ఇందిరమ్మ ఇళ్ల కింద 2589మంది ఎంపిక య్యారు.

ఆంధ్రజ్యోతి:ఎంపిక కానివారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చా?

ఎంపీడీవో:మండల పరిషత్‌లోని ప్రజాపాలన కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలి ఇది నిరంతర ప్రక్రియ.

ఆంధ్రజ్యోతి: ఉచిత విద్యుత్ సబ్సిడీ గ్యాస్‌ను ఎంత మంది లబ్ధిపొందాతున్నారు?

ఎంపీడీవో:మండలంలోని పది గ్రామాలలో తెల్లరేషన్‌కార్డులు ఉన్న అందరు లబ్ధిపొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి?

ఎంపీడీవో: మండలంలో 7819జాబ్‌కార్డులు ఉండగా 5423 మంది కూలీ పని చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: వికలాంగులకు ఉపాధి కోసం రుణాలు మంజూరు అయ్యాయా?

ఎంపీడీవో: మోర్తాడ్‌కు చెందిన వికలాంగురాలైన మహిళకు జిరాక్స్, ఇంటర్నెట్ కింద రూ.50వేలు మంజూరు అయ్యాయి.

● (ఆంధ్రజ్యోతి,మోర్తాడ్)

ఆటోను ఢీకొన్న కారు

● డ్రైవర్ మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు
● మరో ఆరుగురికి స్వల్ప గాయాలు

జక్రాన్‌పల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అ ర్గుల్ గ్రామ సమీపంలో 44వ జాతీయరహదారిపై గురు వారం సాయంత్రం ఆటోను వెనుక నుంచి వచ్చి కారును ఢీకొట్టిన ప్రమాదంలో పడకల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోండ్ల రబి చిన్నయ్య(50) మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపారు. ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం పడకల్ గ్రామానికి చెందిన బోండ్ల రబీ చిన్నయ్య తన ఆటోలో చాందమియా బాగ్‌తండా, పడకల్ గ్రామానికి చెందిన ఎనిమిది ప్రయాణికులను ఎక్కించుకొని ఆర్మూర్ నుంచి జక్రాన్‌పల్లి వస్తుండగా అర్గుల్ గ్రామ సమీపంలోని కోల్డ్ స్టోరేజీ వద్ద వెనుక నుంచి వచ్చి కారు ఆటో ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ బోండ్ల రబీ చిన్నయ్యను, రజనీ, అరుణ, మిగతా ఆరుగురిని చికి త్స కోసం 108 అంబులెన్స్ ఆర్మూర్ ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ బోండ్ల రబి చిన్న య్యను మృతి చెందాడని, అరుణ, రజనీకి తీవ్రగాయాలు కాగా మరో ఆరుగురికి స్వల్పగాయాలైనట్టు ఎస్సై తెలిపారు. కారు వెనుక నుంచి వచ్చి ఆటోను ఢీకొనడంతో కల్వర్టుపై నుంచి ఆటోలో గుంతలో పడిపోయి నుజునుజ్జు అయ్యింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు రెండు రోజుల జైలు

ఖిల్లా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఆటోనడిపి మహిళకు ఢీ కొట్టిన ఆటో డ్రైవర్‌కు రెండో శ్రేణి అదనపు న్యాయాధికారి రెండు రోజుల పాటు జైలు శిక్షను విధించినట్లు నాల్గోటౌన్ రెండో ఎస్ఐ. ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆటోనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ అబ్దుల్ మాజీద్ ఈనెల 29న ఉదయం బ్యాంకు కాలనీ సమీపంలో గల పెట్రోల్‌బంక్ వద్ద నగరపాలక సంస్థ కార్మికురాలు నిమ్మరాజు సాయమ్మ చెట్టుకు నీరు పోస్తుండగా వేగంగా, అజాగ్రత్తగా ఆటోనడిపి ఆమెను ఢీకొట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని బుధవారం కోర్టు ఎదుట హాజరుపర్చగా కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి



కళ్యాణ్ (ఫైల్)

మోపాల్,జనవరి 30(ఆంధ్ర జ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్‌లో బుధ వారం రాత్రి హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ్ (45) లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్సై ఆరీఫ్ తెలిపారు. కళ్యాణ్ డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. గంగాస్థాన్ ఫేస్-2లో నివాసం ఉంటున్న ఆయన రాత్రి డ్యూటీకి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి బెంగుళూరుకు వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ కళ్యాణ్‌ను ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హైకోర్టు జడ్జికి గౌరవ వందనం సమర్పించిన పోలీసులు



రాఘవపల్లిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి విజయ్ సేనారెడ్డి

నాగిరెడ్డిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపల్లి గ్రామానికి గురువారం విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి విజయ్ సేన రెడ్డికి పోలీసులు గౌరవ వందనం చేశారు. హైకోర్టు జడ్జి విజయ్ సేనారెడ్డి తన కూతురు డాక్టర్ అఖిల వివాహ కార్యక్రమంలో భాగంగా రాఘవపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన పోచమ్మ పండగ కార్యక్రమానికి జడ్జి విచ్చేసారు. దీంతో ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హరిక, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, స్థానిక ఎస్సై మల్లారెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పోలీసులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా పోలీసులు హైకోర్టు జడ్జికి గౌరవ వందనం చేశారు. అలాగే హైకోర్టు జడ్జి రాఘవపల్లి గ్రామానికి వెళుతున్న క్రమంలో ఆయన బాల్య మిత్రులు నాగిరెడ్డిపేట మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి, ఆయన సోదరుడు ప్రవాస భారతీయుడు రమేష్ రెడ్డిలు మండల కేంద్రంలో జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కిషన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఫారూఖ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు అప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. అవసరమైన వారికి అద్దాలు వాడాలని, శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు. చూపు మంద గించకుండా ఉండటానికి వాడాల్సిన మందులు గురించి వివరించినట్లు తెలిపారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు



రాహుల్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చండేగాం గ్రామానికి చెందిన రాహుల్ (11) తప్పిపోయినట్లు కేసు నమోదు చేసినట్లు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం చండే గాం గ్రామానికి చెందిన రాహుల్ బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి రాగానే తల్లి రమబాయి బాగా చదువుకోవాలని మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తల్లి రమా బాయి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ పరిశ్రమలకు ప్రోత్సాహం


● ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల

బాన్సువాడ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన వ్యవసాయ పరిశ్రమల తయారీ దారుల సమావేశంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ రాములు, వ్యవసాయ శాఖ అధికారులు సుచరిత, హుస్సేన్ బాబు, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు



మరమ్మతులు చేస్తున్న అధికారులు

రామారెడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాల్లో, తండాల్లో కరెంట్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కరెంట్ ఏఈ నరసింహ తెలిపారు. గురువారం కరెంట్ అప్పుడప్పుడు తీసేసి ఎవరికి అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా కరెంట్ రాకపోకలకు అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కరెంట్ ఏఈ నరసింహ వివరించారు. ఈ కార్యక్రమంలో కరెంట్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులకు మౌనం పాటించిన అధికారులు

రామారెడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ సువర్ణతో పాటు అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికాంత్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫొటో న్యూస్



రైతు వేదిక భవనం ఎదుట కట్టేసి ఉన్న గాడిదలు

గాడిదలకు అడ్డాగా రైతు వేదిక!

మోపాల్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో లక్షల రూపాయలతో నిర్మించిన రైతువేదిక భవనాలను సంబంధిత అధికారులు వినియోగించుకోపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని రైతు వేదికలు పశువులకు అడ్డాగా మారుతున్నాయని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని మంచిప్ప గ్రామంలో నిర్మించిన రైతు వేదిక భవనం ఎప్పుడూ మూసి ఉండటంతో ఇక్కడ గాడిదలకు అడ్డాగా మారింది. అధికారులు ఎవరూ ఇక్కడికి రాకపోవడంతో గాడిదలను ఈ రైతు వేదిక భవనం ముందు కట్టేసి ఉంచుతున్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులు వారానికి రెండు, మూడు సార్లయినా రావాల్సి ఉన్నా రావడం లేదని చుట్టుపక్కల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను అధికారులకు వివరించాలంటే మోపాల్ మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని మంచిప్ప చుట్టుపక్కల గ్రామాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు ఈ రైతు వేదిక భవనానికి వచ్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జర దేఖో!!



ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మోపాల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కానీ వాటి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయకపోవడంతో పశువులు వాటికి తగిలి మరణిస్తున్నాయని మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ముదక్‌పల్లి ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం @ మందుబాబులకు అడ్డా!



ఆరోగ్య ప్రాథమిక ఉపకేంద్రం వద్ద ఉన్న సీసాలు

మోపాల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాల్‌కల్‌లో గల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించినప్పటికీ సంబంధిత అధికారులు ఇంకా ఈ ఉపకేంద్రాన్ని వాడుకంలోకి తీసుకురాకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ ఉపకేంద్రం పక్కనే కల్లుబట్టి ఉండటంతో గ్రామస్థులే కాకుండా నిజామాబాద్ నగర వాసులు ఈ బట్టి నుంచి కల్లు తీసుకొని ఉప కేంద్రం సమీపంలోనే కూర్చొని నిత్యం మందు తాగుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఉపకేంద్రంలో విద్యుత్ సదుపాయం, నీటి సౌకర్యం లేకపోవడంతో ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఉపకేంద్రాన్ని ఇంకా వాడలేకపోతున్నారు. ప్రస్తుతం ఉపకేంద్రం అద్దె గదిలో కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఉపకేంద్రాన్ని వాడకంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిమాన్విత క్షేత్రం.. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

భక్తి

● రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

మెండోర, జనవరి30(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు నిలయమైన ఆపద మొక్కులవాడి సేవలో తరిస్తూ కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి గోవిందా నామాన్ని జపిస్తూ మెండోర గ్రామప్రజలు భక్తి పారవశ్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి ప్రతీరోజు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. కోరిన భక్తుల కోర్కెలు తీర్చే కల్యాణ వేంకటేశ్వరస్వామిగా ప్రసిద్ధి చెందిన ఆలయం భక్తుల పాలిట కొంగు బంగారం అయి గ్రామస్థులంతా భక్తిమార్గంవైపు నడుస్తున్నారు. ప్రకృతి రమణీయతకు చిహ్నంగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గ్రామస్థులందరి కృషితో ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర ఆలయం జిల్లాలోనే ప్రసిద్ధి చెందింది.

● 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఉత్సవ విగ్రహాలు

400 ఏళ్ల చరిత్ర కలిగిన ఉత్సవ విగ్రహాలు ఉండడం ఈ ఆలయానికి మరో ప్రత్యేకత ఉన్నట్లు గ్రామస్థులు చెప్తున్నారు. మెండోర గ్రామంలోని అతిపురాతనమైన ఇంటిలో స్వామి ఉత్సవ విగ్రహాలకు నిత్యం పూజలు, ఆరాధన కార్యక్రమాలు జరిగేవి. గ్రామంలో ఏ శుభకార్యాలు జరిగినా గ్రామస్థులు అంతా ఉత్సవ మూర్తుల దగ్గరికి వెళ్లి మొదట మొక్కులను తీర్చుకొని శుభకార్యాలు మొదలుపెట్టేవారు. గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించేవారు. స్వామివారి ఇష్టమైన వాహన సేవలను ఆ రోజుల్లోనే ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారు.

● గ్రామస్థుల కృషితో ఆలయ నిర్మాణం

గ్రామస్థులంతా ఏకమైన సమావేశం నిర్వహించుకొని ఆలయ నిర్మాణం కోసం నిర్ణయించుకొని కలియుగ దైవం తొలి దైవంగా భావించే కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించుకోవాలని సంకల్పించారు. 2001లో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి తమిళనాడుకు చెందిన ప్రముఖ ఆలయ నిర్మాణకర్తలతో వివిధ కళాకాండలతో ఆలయాన్ని నిర్మించారు. 2014 ఫిబ్రవరి మాసంలో వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించిన శ్రీ పద్మావతి అండాల్ సమేత వేంకటేశ్వర విగ్రహాలను తెప్పించి ప్రతిష్ఠపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వర ఆలయంగా రూపుదిద్దుకున్న ఆలయంగా ప్రసిద్ధి చెందిన ప్రకృతి రమణీయతకు ప్రతీరూపంగా ఆలయం ముందు భాగంలో చూడ చక్కనైన, అందమైన గార్డెన్ ఏర్పాటుచేశారు. అంతేగాకుండా ఆలయ ఆవరణలో భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దినదిన ప్రవర్తన మానంగా ఆలయ ప్రాచస్త్యం చుట్టూ పక్కల గ్రామాలకు తెలియడంతో ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని తిరుమల తిరుపతికి వెళ్లలేని స్వామివారి భక్తులు ఈ ఆలయానికి అధికసంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుంటూ శుభాకార్యాలు చేసుకుంటున్నారు.



మెండోరలో కొలువైన శ్రీ వేంకటేశ్వర ఆలయం



ఆలయంలో కొలువైన స్వామివారు



ఊరేగింపుకు సిద్ధమైన రథం

● ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులు

రేపటి నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి 11 వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ, గ్రామకమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 31నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు భక్తులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 1న శనివారం ధ్వజారోహణం, దేవత ఆహ్వానం, స్వామి వారి ఎదుర్కోలు, 2న ఆదివారం స్వామివారి కళ్యాణం, సాయంత్రం రథోత్సవం, 3న సుదర్శన ప్రతిష్ఠ, చక్రస్నానం, అన్నదానం కార్యక్రమం, ఏకాంతసేవ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సవాలకు భక్తులు విజయవంతం చేయాలి

● ఆనంద్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

మెండోరలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 11 వార్షికోత్సవాలకు ఆలయ కమిటీసభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్నదానం ఏర్పాటుచేశారు. స్వామివారి కల్యాణంలో స్వామివారి రథయాత్రలో స్వామివారి చక్రస్నానంలో భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని, భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణ మహోత్సవం



● ఉత్సవ విగ్రహాలు

బీర్కూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో గురువారం శ్రావణ నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పరిగే శంభురెడ్డి దంపతులు, నాందేడ్‌కు చెందిన సుధ, కోటగిరికి చెందిన శివ రామకృష్ణ, రైతునగర్‌కు చెందిన సందీప్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణ మహోత్సవం జరిపించారు. వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య శ్రీవారి కల్యాణం నిర్వహించగా భక్తులు చూసి తరించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు భక్తులు స్వీకరించారు. ఆలయ సన్నిధిలో ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. బీర్కూర్‌కు చెందిన విజయ్‌కుమార్ అనే భక్తుడు స్వామి వారికి పూల దండల కోసం రూ.21,500 అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శంభురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బోగవల్లి అప్పారావు, నర్సరాజు, హన్మంతరావు, సత్యనారాయణ, ఇస్లావత్ శ్యామ్, ఆలయప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రేణుకా ఎల్లమ్మ జాతర

భిక్కనూరు, జనవరి 3 0(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని (జాతర) శనివారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ గౌడ సంఘం ప్రతినిధులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ 15వ వార్షికోత్సవంలో భాగంగా ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, 4న అమ్మవారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతీ రోజు సాయంత్రం ఒగ్గు కథ ఉంటుందని, భక్తుల జాతర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



రేణుకా ఎల్లమ్మ ఆలయం



ఆలయంలోని ఉత్సవ విగ్రహాలు

నయనానందకరంగా శ్రీనివాసుని కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల వేదమంత్రోచ్చరణలు.. భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీనివాసుడి కల్యాణం నయనానందకరంగా సాగింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని జెండా బాలాజీ మందిర్ దేవాలయంలో గురువారం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవ విగ్రహాల నుంచి కల్యాణ వేడుకలను నిర్వహించారు. భక్తులు గోవిందనామ స్మరణలు చేస్తుండగా అర్చకులు వెలగలేటి నాగరాజాచార్య కల్యాణ తంతును శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు, జాలిగం గోపాల్, రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొలిప్యాక్‌లో లక్ష్మీనర్సింహస్వామి శిఖరం ప్రతిష్ఠాపన

జక్రాన్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం స్వామివారి శిఖరం ప్రతిష్ఠపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలో స్వామివారికి పూజలు చేసిన అనంతరం ఆలయంలో స్వామివారికి కుం బాభిషేకం జరపనున్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో చైర్మన్ మామిడి బాస్కర్‌రెడ్డి, మాజీఎంపీటీసీ మద్దుల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన శిఖరం

● నేడు పడకల్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

మండలంలోని పడకల్ గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి శుక్రవారం తృతీయ ఆలయవార్షిక ఉత్సవాలు, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీసభ్యులు, వీడీసీ సభ్యులు తెలిపారు. ఉదయం నవగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేకపూజలు, శనివారం స్వామిహోమం, ఎదుర్కోలు, ఆదివారం రథోత్సవం, చక్రతీర్థం అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయవార్షికోత్సవం ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లుచేశారు.

శిథిలావస్థలో గ్రామీణ వాటర్ ట్యాంకులు

● పట్టించుకోని అధికారులు

మోపాల్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గల వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకులు కూలిపోయే దశకు వచ్చాయని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డి.శ్రీనివాస్ అప్పుడు నీటి పారుదల శాఖగా ఉన్నప్పుడు గ్రామీణప్రాంతాల్లో వాటర్‌ట్యాంకులను పెద్దమొత్తంలో నిర్మించారని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. అప్పటి వాటర్‌ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథలో భాగంగా ఈ ట్యాంకులోనే నీటిని నింపి ప్రజలకు తాగునీటి కోసం సరఫరా చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రమాదకరంగా మారిన ట్యాంకులను మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న గ్రామీణ వాటర్ ట్యాంకులు

కొనసాగుతున్న అల్లమ ప్రభు జాతర

● ఆలయానికి పోటెత్తిన భక్తులు

నసురుల్లాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల పరిధిలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల అల్లమ ప్రభు ఆలయానికి రెండో రోజు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో నిండు జాతర, రథోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు మాట్లాడుతూ మూడురోజుల పాటు జరిగే ఈ జాతరకు భారీగా జనం తరలివస్తారని కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారని చెప్పారు. శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహిస్తామని, భక్తులకు అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు, పరిశోధనల వైపు సాగాలి

● గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి
● భిక్కనూరు శ్రీ చైతన్య పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం
● ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు

భిక్కనూరు, జనవరి30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జ్ఞానసంపన్నులుగా ఎదిగి సరికొత్త ఆవిష్కరణలు, పరిశోధనల వైపు ముందుకు సాగాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం భిక్కనూరు మండలకేంద్రంలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని చంద్రకాంత్‌రెడ్డి ప్రారంభించగా, విద్యార్థులు సొంతంగా తయారు చేసిన పలు రకాల ప్రాజెక్టులను అతిథులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పరిశీలించి అభినందించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనోవికాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా చంద్రయాన్, వాటర్ క్యూరిఫికేషన్, గ్రామ సంప్రదాయాలు, వ్యవసా యం, పవర్ లిఫ్ట్, వాటర్ డ్యాం, రాకెట్ లాంచింగ్, ఓజోన్ లేయర్‌తో పాటుగా 70రకాల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనాథ్, పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రిన్సిపాల్ అశోక్‌యాదవ్, ప్రముఖులు ఇంద్రకరణ్‌రెడ్డి, భీంరెడ్డి, నంద రమేష్, గజ్జెల భిక్షపతి, అతిమాముల శ్రీధర్, రాజాబాబుగౌడ్, గాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింబాద్రి, అంకం రాజు, సుదర్శన్, వెంకటేష్, రవీందర్, ఆయాగ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం



పాఠశాలలో విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న దృశ్యం



తమ ప్రదర్శనలతో విద్యార్థులు

3న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ

● ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3 వసంత పంచమి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి రావాల్సిందిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావును మండల కాంగ్రెస్ నాయకులు, అయ్యప్ప భక్తులు ఆహ్వానించారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను వారు అందజేశారు. మండలంలో అయ్యప్ప స్వామి ఆలయం లేనందున, అయ్యప్ప భక్తులు, మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు, మండల కేంద్రంలో నూతన అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించ తలపెట్టారు. ఇందులో భాగంగా వసంత పంచమి సోమవారం ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున ఈ భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాల్సిందిగా ఎమ్మెల్యే మధన్‌మోహన్ రావును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్, సంజీవులు, అయ్యప్ప స్వాములు వంశీకృష్ణ గౌడ్, వీరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

బాన్సువాడలో పేలుడు పదార్థాల కలకలం

● 40 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం ● ఒకరిపై కేసు నమోదు
● బాన్సువాడ ఎస్‌హెచ్‌వో అశోక్ వెల్లడి



మాట్లాడుతున్న పట్టణ సీఐ అశోక్

బాన్సువాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో పేలుడు పదార్థాలు జిలెటిన్ స్టిక్స్ కలకలం రేపాయి. బాన్సువాడ పట్టణంలోని రాములు హోటల్ వద్ద గల చౌరస్తా పక్కన పెద్ద బండరాయిపై మాజీ కౌన్సిలర్ నర్సుగొండ తన ఇంటి నిర్మాణం కోసం రెండు రోజుల క్రితం 40 జిలిటెన్ స్టిక్కులు బండ రాయిపై పేల్చేందుకు అనుమతి లేకుండా అమర్చగా, స్థానికులు డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో పట్టణ ఎస్‌హెచ్‌వో మండలి అశోక్ తన పోలీసులతో పాటు కలిసి సంఘటన స్థలానికి చేరుకొని 40 జిలెటిన్ స్టిక్కులను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మున్సిపల్ స్థలంలో పేలుడు పదార్థాలు అమర్చినందుకు గాను మున్సిపల్ సిబ్బంది సతీష్ ఫిర్యాదు మేరకు గురువారం నర్సుగొండపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మండలంలో ఎవరు అనుమతులు లేకుండా జిలెటిన్ స్టిక్కులను వినియోగించరాదని అలా వినియోగించినట్లయితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని సీఐ అశోక్ తెలిపారు. అలాగే పూర్తి విచారణ చేపట్టి సహకరించిన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ఫిబ్రవరి 15 లోగా వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 15లోగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పనులు వసూలు చేయాలని మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ప్రభాకర్‌చారి ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్య దర్శులు ఇంటి పనుల వసూళ్ళ మీద ప్రత్యేక దృష్టిని సారించాలని, ఫిబ్రవరి 15లోగా ప్రతి గ్రామ పంచాయతీలో వందశాతం ఇంటి పనులు వసూలు చేయాలని ఆయన ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమల య్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో సాయిలు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

రామారెడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామంలో గురువారం నిర్వహిం చారు. ఈ శిబిరాన్ని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాంచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పాడి రైతులందరూ తమ తమ పాడి పశువులు 15 నెలలకు ఒక ఈత ఈనేల ప్రణాళికతో ఉండాలని సూచించారు. పశువు సకాలంలో ఎదకు రావాలంటే వాటికి నటల మందులు, మినరల్ మిక్చర్ లాంటివి తప్పకుండా వాడాలని సూచించారు. గ్రామంలోని పశువైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో 15 పశువులకు సాధారణ చికిత్సలు, 55 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, నాలుగు కృత్రిమ గర్భధారణలు, 15 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ రాంచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వి.ఎల్.ఓ శ్రీనివాసరావు, కొండల్ రెడ్డి, జేవీవో నారాయణ, వీఏ రమేష్ , సిబ్బంది ఆంజనేయులు, బాలమని గ్రామంలోని పాడి రైతులు రవీందర్, రమేష్, సుధాకర్, ముగ్గం రాజం, ముదాం రాజు, ఎంబరి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రికెట్ కిట్ అందజేత



చిన్నారులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న దృశ్యం

రామారెడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం పోసాని పేట్ గ్రామానికి చెందిన చిన్నారులకు గురువారం క్రికెట్ కిట్టును అందజేశారు. గ్రామానికి చెందిన కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి సతీమణి గీరెడ్డి అంజనా రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు ఆట, పాటల్లో రాణించాలని, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ఎల్లారెడ్డి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు దుప్పట్లను పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ రఫత్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం కోసం పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనంతో పాటు నాణ్యమైన ఇంగ్లీష్ మీడియంలో బోధన, స్కూల్ స్పోర్ట్స్ యూనిఫారాలను, టెక్ట్స్ బుక్స్ నోట్ బుక్స్, కాస్మోటిక్ కిట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు.



కామారెడ్డిలో గాంధీ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



బాన్సువాడలో..



పెద్దకొడప్‌గల్‌లో..



ఎల్లారెడ్డిలో నివాళులర్పిస్తున్న పోలీసులు

మహాత్మాగాంధీకి ఘన నివాళి

కామారెడ్డి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో మహాత్మాగాంధీ చేసిన పోరాటం మరువలేనిదని శాంతియుతంగా ఉద్యమాలు కొనసాగించి ప్రజలను ఐక్యం చేయడంలో గాంధీజీ ఎంతో కృషిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, కొత్తనర్సింలు, మోతిరాం నాయక్, జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: పట్టణంలోని గాంధీచౌక్‌లో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి మహాత్ముడు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ , ఏజాస్, బాబా, హకీం, ఉదయ్ ఉన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

పెద్దకొడప్‌గల్: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గాంధీ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహనీయుడు గాంధీయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయిల్వార్ రమేష్, రాజు, సతీష్ పటేల్, రోషన్, అనిల్, బండారి బాలాజీ, సురేష్, బిరాదర్ మారుతి, సాజీ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింలుగౌడ్, టేకుర్ల సాయిలు, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శివ, గొల్ల సాయిలు, ప్రశాంత్, చామకూర రాజు, మేకల రాములు, బాలకృష్ణ, సింగని విఠల్, నవీన్, యాట వీరేశం పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం



మౌనం పాటించి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డిటౌన్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఘన నివాళ్లు అర్పించారు. కలెక్టరేట్‌లో మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో స్వాతంత్రోద్యమంలో అమరు లైన వారికి శ్రద్దాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ నరసింహారెడ్డి పోలీసులతో కలిసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో మసూద్ అహ్మద్ పాల్గొన్నారు.

బాన్సువాడ: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, ఇతర దేశ భక్తి పోరాటాలలో ప్రాణాలు అర్పించిన భారతీయ అమరవీరుల గురించి తెలుసు కోవడం ఎంతో గౌరవమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్థానిక ఎస్ఐ బొజ్జ మహేష్ ఆధ్వర్యంలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ని ర్వహిం చారు. ఈ సందర్భంగా మహాత్ముని చిత్ర పటానికి ఎస్ఐ పూల మాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆమా గ్రామాల్లో ఉన్న గాంధీ విగ్రహాలకు, చిత్రపటానికి ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, టీయూ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి. భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ అమలుచేయాలి



కామారెడ్డిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్‌నాయకులు

కామారెడ్డిటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలుచేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్ అన్నారు. గురువారం కామారెడ్డి గాంధీగంజ్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 425 రోజులు గడుస్తున్న ఒక్క హామీని అమలుచేయకుండా నిర్లక్ష్యం వహించడాన్ని బీఆర్ఎస్ పార్టీ తరపున ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంబాల రవియాదవ్, కృష్ణాజీరావు, పిట్లవేణు, మల్లేష్ యాదవ్, ఆంజనేయులు, గెరిగంటి లక్ష్మీనారాయణ, లింగారావు, నరేష్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, నర్సింలు, వెంకటి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సంద ర్భంగా నివాళులు అర్పిస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశానుసారం బాన్సువాడ పట్టణంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మోచి గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి 420 రోజులు అవుతున్న 420 హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజానికానికి మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే రైత న్నలకు, విద్యార్థులకు, మహిళలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పి మీరు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బీఆర్ఎస్ నాయకులు సాయిబాబా, మహేష్‌రమేష్ యాదవ్, శివ, సూరి, సాయిలు. గౌస్ శంకర్. మొగులయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా గురువారం ఎల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆదిమూలం సతీష్‌కుమార్, ఎగుల నర్సింలు, పటేల్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: మండల కేంద్రంలో గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్‌నాయకులు ఆయన విగ్రహానికి వినతి పత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందని ప్రభుత్వం వెంటనే హామీలను అమలుపరచాలని బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరాంనాయక్, మాజీ ఎంపీటీసీ పత్తిశ్రీను, రెడ్డిరాజు, ముస్తఫా, సురేష్‌సంతోష్, సాయిలు, కొమ్ముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశానుసారం మండల కేంద్రంతో పాటు పోసానిపేట్ గ్రామాల్లో మహాత్మా గాంధీ చిత్రపటాలకు వినతి పత్రాలను అందజేశారు. మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనలో చేసిన దగాకోరు 420 హామీల అమలుపై మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి గాంధీకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల నాయకులు పడిగేల శ్రీనివాస్ గుప్తా, కాసర్ల రాజేందర్, బానూరి నర్సారెడ్డి, ల్యాగల మహిపాల్, కడెం శ్రీకాంత్, లింగాపురం శంకర్, రెడ్డి మల్లేష్, పాల మల్లేష్, కట్లకుంట సుధాకర్, రాజయ్య, అంజయ్య, కందూరి నరేష్, లింగం, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: ఎన్నికల వేళ గొంతు చించుకుని రాష్ట్రప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలుపరిచిన అసమర్థ పాలనను సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నాడని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వినతి పత్రం అందించారు. ప్రభుత్వ పాలన అంటే పదేళ్లపాటు కేసీఆర్ ఇచ్చిన హామీలే కాకుండా కొత్త పథకాలను ప్రజలు ఎదురుచూడకుండా అమలుచేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ పాలన అని గుర్తుచేశారు. గత సంవత్సరం రైతుబంధు అందించలేదని,జనవరి 26 వరకు రైతుభరోసా నేరుగా రైతులఖాతాలో జమచేస్తామని చెప్పి మరుసటి రోజు మార్చినెలఖరు వరకు అందిస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. 420 హామీలలో ఒకటైన 100శాతం అమలుచేసినచూపినట్లు చెప్పుకునే స్థితిలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు,ఎమ్మెల్యేలు లేరని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రావుదేశాయ్,నాయకులు నల్చర్‌రాజు, హన్మాండ్లు, మల్లికార్జున్‌పటేల్,యాదరావు, ముఖిద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: కాంగ్రెస్ శాసన సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పర్చేలా చూడాలని కోరతూ లింగంపేట మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు గాంధి విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. పార్టీ అధికారంలోకి వచ్చి 420రోజులు గడిచిన హామీలు అమలు చేయలేదని వారు విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు రమేష్, పోకల సాయిరాం, నాయకులు ముదాం సాయిలు, నర్సింలు, లక్ష్మన్, పర్వయ్య నాయకులు ఉన్నారు.

సదాశివనగర్: ఆరు గ్యారంటీలు అమలుచేయని ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చూడాలని ఉత్తనూరు బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100శాతం అమలు చేసి తమ చిత్తశుద్ధిచాటుకోవాలని తెలిపారు. స్థానిక ఎన్నికలలో లబ్ధి పొందేందుకు ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసానికి గురిచేస్తు ఎన్నికల కోసం సిద్ధమవుతున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు దోడ్లరవి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ కాలనీలో చోరీ

కామారెడ్డిటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయశంకర్‌కాలనీలో బుధవారం రాత్రి తాళంవేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం నిమ్మరాజశేఖర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి బుధవారం మధ్యాహ్నం గర్గుల్‌కు తన అక్క దగ్గరకు వెళ్లాడు. తిరిగి గురువారం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా సామాన్లు అన్ని చిందరవందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. రూ.30 వేల నగదు, బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, 10తులాల వెండి పోయినట్లు బాధితులు తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలలో నిక్షిప్తమైన వివరాలు దొరకకుండా హార్డ్‌డిస్క్‌ను కూడా ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కామారెడ్డిటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా గల ఇందిరాచౌక్ వద్ద ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గత కొన్నిరోజుల నుండి రైల్వేస్టేషన్‌లోనే ఉంటూ భిక్షటన చేస్తూ ఇంద్రచౌక్ గద్దెపైనే పడుకునేదని,పడుకున్న ప్రదేశంలోనే చనిపోయినట్లుగా తెలియగా వెంటనే ఆమె మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కి తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లింగంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన మూగురి రజిత (39) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు. ఈ నెల 25న ఎల్లారెడ్డి- కామారెడ్డి రహదారిపై మెంగారం శివారులోని కరీంనగర్ డైరీ వద్ద శ్రీనివాస్ రజితలు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో జరిగి నరోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రజితకు తీవ్ర గాయాలు కాగా ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తర లించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మృతి చెందినట్లు ఆమె భర్త ముగురి శ్రీనివాస్ పిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బెల్ట్ షాపుపై ఎక్సైజ్ అధికారుల దాడి

లింగంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సోమాగౌడ్ తన ఇంటి వద్ద నిర్వహిస్తున్న బెల్టు షాపుపై గురువారం ఎల్లారెడ్డి ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఇండ్ల మధ్యన బెల్టు షాపు నిర్వహించడం ద్వారా కాలనీలోని మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లింగంపేట మాజీ ఎంపీపీ అబ్దుల్ నయీం ఫిర్యాదు చేయడంతో బెల్టు షాపుపై దాడి చేసినట్లు సీఐ తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకుడు సోమాగౌడ్‌ను బైండోవర్ చేసినట్లు వారు తెలిపారు. షాపులో నిల్వ చేసిన మద్యం సిసాలను సీజ్ చేయకపోవడం ఏమిటని కాలనీవాసులను ప్రశ్నించారు. కాలనివాసులకు సమాధానం ఇవ్వకుండానే వెళ్లిపోయారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

లింగంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగం పల్లి గ్రామానికి చెందిన చౌడం స్వామికి చెందిన ఏడాది వయస్సు గాల లేగ దూడను గురువారం తెల్లవారుజామున చిరుత పులి దాడి చేసి హతమార్చినట్లు బాధిత రైతు అటవి శాఖ అధికారులకు తెలిపాడు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద ఆవులను లేగదూడను కట్టివేసి ఇంటికి వచ్చినట్లు ఆయన తెలిపాడు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా లేగదూడను చిరుత హతమార్చినట్లు గుర్తించి అటవిశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్టు సెక్షన్ అధికారి వినోద్ బీట్ అధికారి లింగయ్యలు సంఘటన స్థలానికి చేరుకుని చిరుత దాడిలో మృతి చెందిన లేగదూడను పరిశీలించారు. నివేదికను అటవిశాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని సెక్షన్ ఆఫీసర్ తెలిపారు. పశు వైద్యాధికారి హన్న జోసఫ్ మృతి చెందిన లేగదూడకు పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందిస్తామని అటవిశాఖ అధికారులు తెలిపారు.

లింగంపేటలో మస్తాన్ షావలి ఉర్సు ర్యాలీ



లింగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

లింగంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం మస్తాన్ షావలీ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భారీ ర్యాలీ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆనందోత్సహాలతో ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఫారూఖ్, ఫతియోద్దీన్, వాహబ్, షాదుల్లాలతో పాటు ముస్లింలు ఉన్నారు.

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ బదిలీ?

కామారెడ్డి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ స్పందన బదిలీ అయినట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా చిన్నశంకర్‌పల్లి మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న శ్రీనివాస్ కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. నేడు లేదా రేపు ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.

ఆస్పత్రి కార్మికులకు వేతనాలు చెల్లించాలని వినూత్న నిరసన



బాన్సువాడలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

బాన్సువాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ప్రభుత్వ ఎంసీఎచ్, ఆసుపత్రి ముందు నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని ఆసుపత్రి కార్మికులు గురు వారం మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ పేషంట్ కేర్ శానిటేషన్ కార్మికు లకు రావలసిన నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు పని భద్రత కల్పించాలని, ప్రతీ నెల 5వ తేదీన జీతాలు చెల్లించాలని, జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సంతోష్ గౌడ్, రేణుక, సయ్యద్ కమర్ అలీ, సురేఖ ప్రేమ్‌సింగ్, కల్యాణి, జైల్‌సింగ్, సంగీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- సంక్రాంతికి వస్తున్నాం
దర్శన్	- పుష్ప-2
ప్రియా 70	- డాకు మహారాజ్
ప్రియా 35	- గేమ్ చేంజర్

బాన్సువాడ

మహేశ్వరి	- సంక్రాంతికి వస్తున్నాం
వెంకటేశ్వర	- డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

